# సాక్షి
## మంచిర్యాల

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023






**ఉత్తరం రాద్దాం.. బహుమతి గెలుద్దాం**

నేటి తరానికి ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు కేంద్రం లేఖరులకు పోటీ పెడుతోంది. బహుమతులు ఇస్తోంది. 8లో▸



**గడ్డి క్షేత్రాలకు కేరాఫ్ జన్నారం**

అడవిలో వన్యప్రాణుల సంఖ్య వాటి ఆవాసాలలో విస్తరించి ఉన్న గడ్డి క్షేత్రాల సాంద్రతపై ఆధారపడి ఉంటుంది. అటవీశాఖ వ్యాప్తంగా గడ్డి క్షేత్రల పెంపకంపై దృష్టిపెట్టింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
**29.6 /25.3**

**వాతావరణం**

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### 228 మంది సర్టిఫికెట్ల పరిశీలన



వివరాలు ఎన్‌రోల్‌చేస్తున్న అధ్యాపకుడు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో మంగళవారం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా విద్యార్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ముందుగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేసి సర్టిఫికెట్లు పరిశీలించారు. మొత్తం 228 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

### టెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

**నస్పూర్:** ఈనెల 15న టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అధికారులకు సూచించారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో టెట్ నిర్వహణపై జిల్లా పంచాయతీ, విద్య, మిషన్ భగీరథ, విద్యుత్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈనెల 15న ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్–2 పరీక్ష ఉంటుందని వివరించారు. జిల్లాలో 7,837 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. వారి కోసం 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని సూచించారు. సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని తెలిపారు.


### వేతనాలు పెంచాలని వినతి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** టీఎస్ ట్రాన్స్‌కోలో పని చేస్తున్న సీబీడీ గ్యాంగ్ ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్–1 వేతనాలు చెల్లించాలని పాత మంచిర్యాలలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఎస్ఈ సంపత్‌రావుకు కార్మికులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సీఐటీయూ నాయకులు బత్తిని శివ శేఖర్, సీబీడీ గ్యాంగ్ కార్మికులు నాగుల శ్రీనివాస్, రాజు, రసమల శ్రీధర్, పెదింటి రాము, బండి శ్రీధర్, పార్వతి మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వర్షంలోనే నిరాహార దీక్ష



వర్షంలోనూ నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక ఐబీ చౌరస్తాలో సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తు తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగాల సంఘాల జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం వర్షంలోనూ కొనసాగించారు. ఈసందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షురాలు భారతీదేవి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మినిమం టైంస్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలన్నారు. హెల్త్ ఇన్సురెన్సూ, ఎక్స్‌గ్రేషియా సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులను తెలంగాణ విద్యాశాఖలో విలీనం చేయాలని, మహిళ ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి రాజన్న, కోశాధికారి నగేష్ పాల్గొన్నారు. దీక్షకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేవీ.ప్రతాప్ మద్దతు తెలిపారు.

# చేప లెక్క ఎవరికెరుక?

- విత్తన పంపిణీలో లోపిస్తున్న పారదర్శకత
- దశలవారీ పంపిణీతో అవకతవకలు
- చేప సైజు, నాణ్యత లెక్కించడంలోనే సమస్య
- ఈ ఏడాది పంపిణీ మరింత జాప్యం



| చేప విత్తన పంపిణీ లక్ష్యం | ఉత్పత్తి లక్ష్యం | ఇప్పటివరకు వదిలింది |
|---|---|---|
| 2.20కోట్లు | 20వేల టన్నులు | 22లక్షలు |

**సాక్షిప్రతినిధి, మంచిర్యాల:** మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా చెరువులు, కుంటలు, జలాశయాల్లో ఉచితంగా చేపపిల్లలు వదులుతోంది. అయితే ఈ ఉచిత చేప పిల్లల మాటున గోల్‌మాల్ జరుగుతోంది. చేప విత్తనాన్ని లెక్కించే వీలు లేకపోవడంతో సైజు, లెక్కల్లో తేడా బయటపడడం లేదు. నాసిరకం విత్తన చేపలను పంపిణీ చేస్తున్నారు. అవి ఎదగక ఉత్పత్తి తగ్గుతోంది. ఈ పథకంలో వందశాతం సబ్సిడీతో చేప విత్తనాల్ని ప్రభుత్వమే అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 117 మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. అయితే కోట్ల సంఖ్యలో చేపల్ని పంపిణీ చేయాల్సి ఉండడంతో కిలోల, చొప్పున వాటి రకాన్ని చూపించి నీటిలో వదులుతున్నారు. చేపపిల్లల సైజు, బరువు తెలుసుకోవడం కష్టంతో కూడుకున్న పని కావడంతో ఈ పథకం అమలులో పారదర్శకత లోపిస్తోంది. మరోవైపు అదును దాటాక, అధిక వర్షాలు కురుస్తున్న సమయంలో చేప పిల్లలు వదలడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది.

**ప్రతిపాదనలోనే విత్తన ఉత్పత్తి..**

జిల్లా పరిధిలోనే చేప, రొయ్య విత్తన అభివృద్ధి చేయాలనే ఆశయంతో గోదావరి తీరం ఎల్లపల్లి బ్యారేజీ దిగువన నీటి పారుదలశాఖ పరిధిలోని 29 ఎకరాల్లో విత్తన ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. అయితే ఏళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు. స్థానికంగా అన్ని వనరులు ఉన్నా విత్తన ఉత్పత్తి జరగడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి విత్తనం రవాణా చేసి, ఇక్కడికి వచ్చేలోపే నాణ్యత లోపిస్తోంది. వీటిని నివారించేందుకు జిల్లా పరిధిలోనే ఉత్పత్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఈ ఏడాది నలుగురు కాంట్రాక్టర్లు జిల్లాలోని జలాశయాల్లో చేప విత్తనాల్ని పంపిణీ చేసేందుకు టెండర్లు దక్కించుకున్నారు.

**వరదలతో జాప్యం..**

రెండేళ్లుగా అధిక వర్షాలకు చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వరదలు పోటెత్తుతున్నాయి. గోదావరిలో ఎగువన కురుస్తున్న వానలకు లక్ష క్యూసెక్కుల్లో వరదలు వస్తున్నాయి. ఈ సమయంలో చేపల్ని వదిలితే దిగువకు వెళ్లిపోతాయని రెండేళ్లుగా ఎల్లంపల్లి బ్యారేజీలో కొత్తగా చేప విత్తనాల్ని వదలడం లేదు. దిగువన మంచిర్యాల, నస్పూర్ పరిధిలో గోదావరి ప్రవాహం తక్కువగా ఉన్నప్పుడు వదులుతున్నారు. దీంతో రిజర్వాయర్లు, సీజనల్ చెరువుల్లోనూ సకాలంలో విత్తనాలు వేయడం లేదు. ఆగస్టు నాటికే విత్తన పంపిణీ పూర్తి కావాల్సి ఉన్నా, సెప్టెంబర్ దాటినా అనుకూలించక పోవడంతోనూ జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు గోదావరిలో 22 లక్షల చేప పిల్లల్ని వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.

### లెక్కించడం కష్టమే !

చేప విత్తనాల్ని ఒక్కోటిగా లెక్కించడం కష్టం కావడంతో బుట్టల్లో నేరుగా నీటిలో వదులుతున్నారు. ఒక్కో చోట దశల వారీగా చేప పిల్లల్ని వదులుతుండడంతో మొదటి సారి లెక్క ప్రకారం వేస్తూ ఆ తర్వాత లెక్క తప్పుతున్నారు. చిన్నతరహా నీటి వనరులైన కుంటలు, చెరువుల్లో 35 మిల్లీ మీటర్ల నుంచి 40 మి.మీ వరకు, రిజర్వాయర్లలో వంద మి.మీ. ఉన్న రవు, బొచ్చె, మ్రీగాల, బంగారుతీగతోపాటు రొయ్య విత్తనాలను వదులుతున్నారు. అయితే ఎదిగిన తర్వాత వీటి సగటు బరువు కిలోన్నరలోపే ఉంటోందని మత్స్యకారులు చెబుతున్నారు. పెద్ద సైజు ఉన్న చోట కాస్త బరువు పెరుగుతోందంటున్నారు. చాలా చోట్ల ఆశించిన మేర ఎదగడం లేదు. టెండర్లు వేసేప్పుడు జాప్యం, రాజకీయ జోక్యం, పోటీపడి తక్కువ ధరలకు కోట్ చేయడంతోనూ లాభం కోసం ఆలోచించడంతో నాణ్యమైన విత్తనాలు రావడం లేదు. అధికారులు, మత్స్యకారుల సమక్షంలోనే నీటిలో వదులుతున్నప్పటికీ చూసిచూడనట్లు వదిలేస్తున్నారు.

## ఉత్తమ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడు



జిల్లాలోని జన్నారం మండల కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మురిమడుగుల రమేశ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. - జన్నారం

# ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలు



ఉత్తమ ఉపాధ్యాయులతో విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, కలెక్టర్, అధికారులు

- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

**నస్పూర్:** నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమైనదని ప్రభుత్వ విప్ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి సుమన్ హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ ఒక వ్యక్తిని విద్యార్థి దశ నుంచి సన్మార్గంలో నడిపిస్తూ మంచి అలవాట్లు నేర్పిస్తూ భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తాము ఉన్నత స్థాయిలో ఉన్నామంటే దానికి గురువులే కారణమన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ కనబర్చిన మొత్తం 90 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. అంతకు ముందు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కా ర్యాక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో ఎస్.యాదయ్య, డీఆర్డీవో శేషాద్రి, అధికారులు నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరి..

**మంచిర్యాలటౌన్/మంచిర్యాల రూరల్/దండేపల్లి:** మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల, హాజీపూర్, నస్పూర్, లక్సెట్టిపేట్, దండేపల్లి మండలాలకు చెందిన పలువురు అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసం నుంచి 150 వాహనాల్లో 500 మందికిపైగా బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పత్రాలను అక్కడ ఉంచారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు వెళ్లి, మాజీ ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో గాంధీభవన్ చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో హాజీపూర్ జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, రైతుబంధు సమితి అధ్యక్షుడు పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రాచకొండ ఆశాలత, రాచకొండ వెంకటేశ్వర్‌రావు(బుజ్జన్న), తెలంగాణ ఉద్యమకారుడు సిరిపురం రాజేశం, గోనె సతీశ్‌రావు, బొడ్డు శైలజ శంకర్, బీఆర్‌ఎస్ హాజీపూర్ మండల మాజీ అధ్యక్షుడు దొమ్మాటి సత్తయ్య, ఉపసర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరపు జితేందర్‌రావు, వేంపల్లి మాజీ ఉపసర్పంచ్ గోనె సంజయ్, సాగె సుమోహన్, బెల్లంకొండ మురళీధర్, సింగతి మురళి, చిలువేరు నాగేశ్వర్‌రావు, దండేపల్లికి చెందిన బైడి వేణుగోపాల్‌రావు, పెంట సత్తయ్య, కర్నాల మల్లయ్య, ఎంబడి శ్రీనివాస్, బత్తిని మల్లేశ్, మొగిలిపాక వెంకటేశ్, రెబ్బనపల్లి నుంచి పనాస రాజయ్య, బండ స్వామి, ఇతర నాయకులు ఉన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తూ..



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

# ఉత్తమ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా జీవరత్నం

**మంచిర్యాలటౌన్:** జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో గిరిజన స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బండ జీవరత్నం జిల్లాస్థాయి ఉత్తమ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడంతోపాటు, 400 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించేలా కృషి చేసినందుకు పురస్కారం అందించినట్లు తెలిపారు.



పీవో చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జీవరత్నం

# గ్రేడ్–4 కార్యదర్శులుగా జేపీఎస్‌లు

**నస్పూర్:** పనితీరు ప్రమాణికంగా క్రమబద్ధీకరణకు అర్హత సాధించిన 15 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు(జేపీఎస్) కలెక్టర్ బాదావత్ సంతోష్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గ్రేడ్–4 కార్యదర్శులుగా మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. నస్పూర్‌లోని జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన 15 మంది జేపీఎస్‌లను క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందించారు. విధులను అంకిత భావంతో నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గ్రామాల్లోని ప్రజలకు చేరవేసేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ జేపీఎస్‌లు బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం వలన అనేక పంచాయతీలు రాష్ట్ర జాతీయ స్థాయిలో అవార్డులు సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీవోలు శ్రీపతి బాపు, వేదాల శ్రీనివాస్, కొమ్మెర సతీశ్‌కుమార్, డీపీవో కార్యాలయాధికారి ప్రజ్ఞ పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందుకున్న జేపీఎస్‌లతో కలెక్టర్, ఎమ్మెల్యే

# నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలి

**నస్పూర్:** జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.4,625 కోట్లుగా నిర్దేశించడం జరిగిందని, బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి వార్షిక రుణ లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. జూన్ వరకు రూ.1,234 కోట్ల రు ణాలు అందించినట్లు తెలిపారు. వ్యవసాయ, గృహనిర్మాణ, పరిశ్రమల రుణాలు వివిధ రం గాల రుణాలు మొత్తం రూ.344 కోట్లు నిర్ణయించినట్లు వివరించారు. కేంద్ర ప్రభు త్వ పథకాలకు సంబంధించి చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఆర్డీవో శేషాద్రి, ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌కల్లూరి, నా బార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, అధికారులు అపర్ణరెడ్డి, మురళీమోహన్, తిరుపతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**ఆయిల్‌పాం సాగువిస్తీర్ణం పెంచాలి**

**నస్పూర్:** జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్‌తో కలిసి మ్యాట్రిక్, డ్రిల్ కంపెనీల ప్రతినిధులు, అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పాం సాగులో కలిగే లాభాలను వివరించాలన్నారు. జిల్లా ఉద్యానవన అధికారులు సహజ, తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

# విస్తారంగా వానలు

- పొంగుతున్న వాగులు, వంకలు
- మళ్లీ మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- మూడు రోజుల్లో 13.5 సెంటీమీటర్లు



వేలాల కమాన్ రోడ్డుపై నుంచి ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు

**మంచిర్యాల అగ్రికల్చర్/జైపూర్:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నెల రోజుల తర్వాత ఆదివారం మొదలైన వనాలు జిల్లాలో దంచికొడుతున్నాయి. మంగళవారం ఉదయం కాస్త విరామం ఇచ్చినా. మధ్యాహ్నం నుంచి మళ్లీ ముసురు మొదలైంది. సాయంత్రం చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జూలైలో భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహించిన వాగులు, వంకలు, గోదావరి, గతనెలలో వర్షాలు లేక వెలవెలబోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు మళ్లీ పొంగుతున్నాయి. మూడు రోజుల్లో జిల్లాలో 13.5 సెంటీమీటర్ల వర్షం కురువడంతో చెరువులు కుంటల్లోకి భారీగా వరద చేరుతోంది. నీల్వాయి ప్రాజెక్టు, చిన్నతరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. సింగరేణి ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. జైపూర్ మండలంలో భారీ వర్షానికి రసూల్‌పల్లి పెద్దవాగు మరోసారి ఉప్పొంగింది. మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిపై వరద నీటి ప్రవాహంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

**నాలుగు మండలాల్లో ఇంకాలోటే..**

జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు 28.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జన్నారం అత్యధికంగా 68.1 మిల్లీమీటర్లు, జైపూర్‌లో 57.8, నస్పూర్‌లో 41.6, భీమారంలో 40.8, వేమనపల్లిలో 37.7, చెన్నూర్‌లో 34.2 మంచిర్యాలలో 33.3, మందమర్రిలో 28, కోటపల్లిలో 28.2, దండేపల్లిలో 25.1, కాసిపేటలో 24.4, లక్సెట్టిపేటలో 20.9, భీమినిలో 17.4, కన్నెపెల్లిలో 17.2, హాజీపూర్‌లో 10.2, నెన్నెలలో 9.4, బెల్లంపల్లిలో 7.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 802.1 మిల్లీమీటర్లు కాగా, 829.1 మిల్లీమీటర్లు కురిసింది. భీమిని, కన్నెపెల్లి, తాండూర్, నెన్నెల మండలాల్లో 17 నుంచి 28 శాతం లోటు నెలకొంది.

**ఎల్లంపల్లికి 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** భారీ వర్షాలు, ఎగువన ఉన్న కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వస్తున్న భారీ వరదతో ఎల్లంపల్లి జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ 30 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అంతే మొత్తంలో నీటిని కిందకు వదులుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 90 వేలు, కడెం నుంచి 11 వేలు, ఎగువ ప్రాంతాల నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల వరద ఎల్లంపల్లికి వస్తుందని అధికారులు వెల్లడించారు. గేట్లను ఎత్తడంతో పాలనురుగును తలపిస్తున్న గోదావరి పరవళ్లను చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. దీంతో మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, ఎస్సై నరేశ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాల నురగలా గేట్ల నుంచి నదిలోకి వరద..

## క్లుప్తంగా

### విద్యుత్ తీగలు తెగిపడి ఐదు గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

**కాసిపేట(బెల్లంపల్లి):** మండలంలోని దేవాపూర్ సమీపంలో మంగళవారం విద్యుత్ తీగలు తెగిపడడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేతకు వెళ్లిన గేదెలు వర్షంలో ఇంటికి తిరిగి వస్తుండగా విద్యుత్ తీగలు తెగి వాటిపై పడడంతో గ్రామానికి చెందిన గడ్డి కుమార్, పార్వతి సత్తయ్య, షేక్ ఇమామ్, కసర్ల లస్మయ్య, జంగిల్ రాజ్‌కుమార్‌లకు చెందిన గేదెలు మృతి చెందాయి. సమీపంలోని చేనులో గల టేకు చెట్టు విరిగి లోటెన్షన్ తీగలపై పడటంతో వైర్లు తెగినట్లు విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. బాధితులు వివరాలతో దరఖాస్తులు అందజేస్తే నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

### మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


శైలజ (ఫైల్)

**బెల్లంపల్లిరూరల్:** పరీక్షలో ఫెయిలయ్యానని మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం పెర్కపల్లి గ్రామానికి చెందిన రైతు కందుల రాజయ్య, రాణి దంపతుల కుమార్తె కందుల శైలజ(22) బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల వార్షిక పరీక్షలు రాయగా వారంరోజుల క్రితం ఫలితాలు వెలువడ్డాయి. అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైంది. ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### వర్షానికి కూలిన పెంకుటిళ్లు


కూలిన పెంకుటిళ్లు

**జైపూర్:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని వేలాలలో ప్యాగ రాజమ్మ–మధునయ్య దంపతులకు చెందిన పెంకుటిళ్లు కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం ఉదయం ఇళ్లు కూలినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### నేడు పీసీసీఎఫ్ పర్యటన

**జన్నారం:** కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో బుధవారం రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) జైస్వాల్ పర్యటిస్తారని ఎఫ్‌డీవో మాధవరావు మంగళవారం తెలిపారు. గడ్డి మైదానాలు పరిశీలన, జింకల పునరుత్పత్తి కేంద్రం, మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాలను ప్రారంభిస్తారని తెలిపారు. జైస్వాల్‌తో పాటు గడ్డి మైదానాల నిపుణుడు మురత్కర్, వివిధ ప్రాంతాల నుంచి అటవీ అధికారులు రానున్నట్లు ఆయన తెలిపారు.



# ఉత్తరం రాద్దాం.. బహుమతి గెలుద్దాం

- లేఖ రచనను ప్రోత్సహించేందుకు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు
- విజేతలకు నగదు బహుమతులు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా తపాలాశాఖ




**నిర్మల్‌ఖైన్‌గేట్/నేరడిగొండ:** నేటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, ఈ–మెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. ఐదు దశాబ్దాల ముందుకు వెళ్తే ఉత్తర ప్రత్యుత్తరాలు కేవలం లేఖల ద్వారానే జరిగాయి. దూరప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారాన్ని ఉత్తరం, టెలిఫోన్, టెలిగ్రామ్ ద్వారా తెలుసుకునే పరిస్థితి ఉండేది. సెల్‌ఫోన్ వినియోగం.. ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వాడకం తర్వాత సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చిందని చెప్పవచ్చు. నేటి తరానికి ఇంచుమించుగా ఉత్తరం అంటే తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు, తెలిసిన వారికి మరోసారి గుర్తు చేసేందుకు తపాలా శాఖ నడుం బిగించింది. ఇందులో భాగంగా లేఖరులకు పోటీ పెడుతోంది.

**'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా'...**

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపరు తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కానరాదు. మొబైల్ ఫోన్ ద్వారా సమస్త సమాచారాన్ని క్షణాల్లో వివిధ మార్గాల్లో చేరవేస్తున్నారు. ఫోన్ లోనే ప్రత్యక్షంగా వాయిస్ కాల్, వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకునే పరిస్థితి ఉంది. ఖండాంతరాల్లో ఉన్న వారితో సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే పరిస్థితి ఉండడంతో లేఖల ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలు మర్చిపోయిన పరిస్థితి ఉంది. ఒకప్పటి సమాచార సాధనమైన ఉత్తరాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలా శాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో 'ధాయి ఆఖర్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

**బహుమతులు ఇలా..**

రెండు కేటగిరీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 12 మందికి మించకుండా ప్రథమ రూ.25 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందజేస్తారు.

**రెండు విభాగాల్లో..**

ఈ పోటీల్లో భారతదేశ పౌరులు పాల్గొనవచ్చు. 18 ఏళ్ల లోపు వారికి ఒక కేటగిరీ, ఆపై వారిని మరో కేటగిరీగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చారు. ఏ4 సైజ్ పేపరుపై రాసి ఎన్వలప్ కవర్‌లో పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్స్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. వ్యాసం చేతితో మాత్రమే రాసి పంపించాలి. లేఖలు పంపించే వారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయస్సు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను ఎస్పీవోఎస్, ఆదిలాబాద్ డివిజన్ చిరునామాకు అక్టోబరు 31లోగా పంపించాలి.

**సద్వినియోగం చేసుకోవాలి**



పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సదవకాశం. వయసుతో పనిలేకుండా ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరితో వ్యాసం రాసి పోస్ట్ చేయాలి.

– ఎస్.అనిల్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాలా శాఖ పర్యవేక్షకులు

### స్క్రాప్ స్వాధీనం

**మందమర్రిరూరల్:** పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ఏరియా సమీపంలోని అటవీప్రాంతంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న స్క్రాప్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌అండ్‌పీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు పోగు చేసుకుని ఆటోలో తరలించడానికి సిద్ధంగా ఉన్న సింగరేణికి సంబంధించిన సుమారు టన్నున్నర స్క్రాప్‌ను గుర్తించి మందమర్రిలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

### 'తారలే తారంగమాడే వేళ' ఫస్ట్‌లుక్ విడుదల



విడుదలైన పోస్టర్

**చెన్నూర్:** చెన్నూర్ టాకీస్ బ్యానర్‌పై తీస్తున్న 'తారలే తారంగమాడే వేళ' ఫస్ట్‌లుక్‌ను నిర్మాత చెన్నూరి శ్రీవాణి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పాటను చెన్నూర్‌లో చిత్రీకరించడం సంతోషంగా ఉందన్నారు. పాటను త్వరలోనే చెన్నూర్ టాకీస్ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## నల్లబ్యాడ్జీలతో మైనింగ్ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న మైనింగ్ స్టాఫ్

**జైపూర్(చెన్నూర్):** సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సూపర్‌వైజర్లను ఎంవీటీసీల లో కాంట్రాక్టు పద్ధతిన నియమించడానికి జారీచేసిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఐకే1ఏ, ఐకేటీసీపీపై మైనింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గని మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ అన్వేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, బలరాం, రమేశ్, ఇక్బాల్, రాజేశం, బంచాని శ్రీనివాస్, మల్లేశ్, ఉదయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ కళకు 'ప్రతిభా' పురస్కారం

- వెడ్మ శంకర్‌కు దక్కిన గౌరవం
- కిక్రీ వాయిద్యంలో అందవేసిన చేయి


ప్రతిభా పురస్కారం అందుకుంటున్న శంకర్


కిక్రీ వాయిస్తున్న వెడ్మ శంకర్ (ఫైల్)

**తిర్యాణి(ఆసిఫాబాద్):** సాధారణంగా ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళారంగంపై మక్కువ చూపుతారు. పురాతన కాలం నుంచి ఆదివాసీలు సృష్టి, వంశపురాణాలపై పాటల రూపంలో గానం చేస్తుండేవారు. మారుతున్న కాలంతో పాటు కళారంగంలో సైతం మార్పులు వస్తుండడంతో అధునాతన పరికరాలతో సంగీతం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో ప్రాచీన కళలు రోజురోజుకు అంతరించిపోతున్నాయి. ఈ సమయంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వెడ్మ శంకర్ కళను గుర్తించి ప్రతిభా పురస్కారం అందించడంతో ప్రాచీన కళకు జీవం పోసినట్లుగా మారింది.

**రోజుల తరబడి గానం చేసే సామర్థ్యం...**

తిర్యాణి మండలంలోని ఎదులపహాడ్ గ్రామానికి చెందిన వెడ్మ శంకర్ ఆదివాసీల్లో అత్యంత వెనుకబడి ఉన్న తోటి తెగకు చెందినవాడు. చిన్ననాటి నుంచే కళారంగంపై మక్కువ పెంచుకున్న శంకర్ తన పెద్దనాన్న కుమారుడైన రాము కళాబృందంతో తిరుగుతూ కిక్రీ (వీణ వంటి సంగీత వాయిద్యాం) నేర్చుకున్నాడు. విలక్షణ సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన గోండు తెగ చెందిన వారు తమ ఇంట్లో జరిగిన శుభ, అశుభ కార్యక్రమాల్లో తమ వంశం లేదా గోత్రానికి సంబంధించిన చరిత్రను తోటి కళాకారులతో పాటలు, కథల రూపంలో చెప్పించుకోవడం అనాదిగా వస్తోంది. అంతేకాకుండా తోటి కళాకారులతో పాటలు పాడిస్తే వర్షాలు కురుస్తాయన్న నమ్మకం గోండులల్లో ఉంది. అదే కళను నమ్ముకున్న వెడ్మ శంకర్ కిక్రీ వాయిద్యంతో తన కళను కొనసాగిస్తున్నాడు. అంతేకాకుండా డప్కా, కర్నడ్, సన్నాయి, ఖాళీకోం లాంటి పురాతన సంగీత వాయిద్యాలను సైతం వాయించడం నేర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేశ్ ఆధ్వర్యంలో 2021లో శంకర్ ఇంటికి వెళ్లి 9 రోజుల పాటు అతని కళను వీడియో రికార్డు చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021 ప్రతి భా పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా గత నెల 30న జానపద కళారంగం విభాగంలో వెడ్మ శంకర్‌కు ప్రతిభా పురస్కారం అందించడం జరిగింది...

**మరింత ఉత్సాహం**



కిక్రీ వాయిద్యంతో సంస్కృతి, సంప్రదాయాలను కథలు, పాటల రూపంలో గానం చేస్తూ వస్తున్నా. పురాతన జానపద కళారంగాన్ని తెలుగు విశ్వవిద్యాలయం గుర్తించి 2021 సంవత్సరానికి గానూ ప్రతిభా పురస్కారం అందజేయడం మరింత ఉత్సాహం కలిగిస్తోంది.

– వెడ్మ శంకర్, కిక్రీ కళాకారుడు

## ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలి


ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**నస్పూర్:** సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్, లాభాల్లో 35 శాతం వాటా ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య మాట్లాడుతూ ఏరియర్స్ చెల్లింపులో కాలాయాపన చేస్తూ కార్మికులను అసంతృప్తికి గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. పట్టణంలోని షంషీర్ నగర్ బస్తీకి చెందిన మురుకుట్ల కిరణ్ దురలవాట్లకు బానిసై కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నాడు. బస్తీలో ఉన్న నందిని టెంట్‌హౌజ్‌లో కూలీగా పనిచేస్తున్న కిరణ్ ఈ నెల 2న రాత్రి టెంట్ హౌజ్ యాజమాని రాజ్‌కుమార్ చేతికి టెంట్‌హౌజ్ బకాయిలు రూ.3.20 లక్షలు అందినట్లు తెలుసుకున్నాడు. అదే రోజు రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి తాళం వేసి మందమర్రిలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన కిరణ్ ఇంటి వెనకాల ఉన్న తలుపును ఇనుపరాడ్‌తో పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి రూ.3.20 లక్షలు అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తాజా చోరీతో పాటు గతంలో చేసిన దొంగతనాల చిట్టా వివరించాడు. 2022 సెప్టెంబర్‌లో బెల్లంపల్లిబస్తీలో, నవంబర్‌లో బజారు ఏరియాలో ఉన్న ముఖేష్ డ్రెస్సెస్‌లో,ఈ ఏడాది ఏప్రిల్‌లో బెల్లంపల్లి బస్తీలోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుండి రూ.2,06 ,910 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### బోనస్ డబ్బులకోసం తునికాకు కూలీల ఆందోళన


సెక్షన్ అధికారిని నిలదీస్తున్న కూలీలు

**వేమనపల్లి(బెల్లంపల్లి):** బోనస్ డబ్బులు రావడంలేదని మంగళవారం తునికాకు కూలీలు అటవీ సెక్షన్ అధికారి కార్యాలయం ఎదుట సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేశం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కల్లాదార్ల కుటుంబాల్లో ఏనాడు తునికాకు సేకరణకు వెళ్లకున్నా రూ.50 వేలు, రూ.60 వేలు జమ అయ్యాయని, తమకు బోనస్ డబ్బులు రావడం లేదని మండల కేంద్రంతో పాటు రాజారాం, సుంపుటం, జాజులపేట గ్రామాలకు చెందిన కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎస్‌ఓ రవికుమార్, ఎఫ్‌బీఓ పోచయ్య విషయాన్ని కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్‌సర్దార్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లగా ఖాతా నంబర్లు సరిగాలేని కొందరికి బోనస్ డబ్బులు పడలేదని అవి సరిచేసి పంపామని, విడతల వారీగా కూలీల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు.

### 17న ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు రాతపరీక్ష

**నస్పూర్:** సింగరేణి సంస్థలో మోటర్ మెకానిక్, కేటగిరీ–1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు ఈ నెల 17న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కే.బసవయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగూడెంలోని మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మధ్యాహ్నం 2 నుంచి 3:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6 నుంచి www. scclmines. com వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

### '132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి'

**జన్నారం:** జన్నారం మండల ప్రజలు, రైతుల ఇబ్బందులు గుర్తించి 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు భుక్య జానుబాయి డిమాండ్ చేశారు. సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మంగళవారం మద్దతు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, బీజేవైఎం నాయకుడు మహేశ్, రాజన్న, అరవింద్, రవి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలు


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

**ఉట్నూర్‌రూరల్:** ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉట్నూర్ కుమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీలను ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మొత్తం 76మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. గిరిజన ఆశ్రమ విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు నూతన అంశాలపై ఉత్సాహం చూపిస్తారని వారి స్థాయికి అనుగుణంగా బోధించాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రులతో కాకుండా ఎక్కువ కాలం గడిపే ప్రదేశం పాఠశాల అని పాఠశాల వాతావరణం విద్యార్థికి ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏటీడీవోలు, ఏసీఎంవోలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై సీఎల్‌సీ సమక్షంలో చర్చలు


చర్చలు జరుపుతున్న శ్రీనివాసులు

**జైపూర్:** మండల కేంద్రంలోని ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్, హెచ్ఎంఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో పలు దఫాలుగా సమ్మె నోటీసులు అందించగా మంగళవారం హైదరాబాద్‌లో డెప్యూటీ సీఎల్‌సీ(చీఫ్ లేబర్ కమిషనర్) డి.శ్రీనివాసులు సమక్షంలో వేర్వేరుగా చర్చలు జరిపారు. హెచ్ఎంఎస్, బీఎంఎస్ యూనియన్ల ప్రతినిధులు, సింగరేణి అధికారులు, పవర్‌మేక్ కంపెనీ అధికారులతో కార్మిక సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం బీఎంఎస్ నాయకులు డైరెక్టర్ బలరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఎస్టీపీపీ అనుబంధ హెచ్ఎంఎస్ ప్రతినిధులు విక్రమ్, చిప్పకుర్తి సంపత్, ప్రదీప్, సాయికృష్ణ, రమేశ్, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, కార్యనిర్వాహణ అధ్యక్షుడు పేరం రమేశ్, అధ్యక్షుడు చినూరి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


**ఉట్నూర్‌రూరల్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 8న శుక్రవారం ఉదయం 9గంటలకు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రంలో ఎంపిక ఉంటుందని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఉద్యోగ అవకాశం, ఉచిత విద్యలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 17–20 సంవత్సరాల మధ్య ఉండి పదో తరగతిలో 60 శాతం, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ లేదా ఒకేషనల్‌కోర్స్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9493535052 నంబరులో సంప్రదించాలని కోరారు.

## ఇరురాష్ట్రాల పోలీస్ అధికారుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

**జైపూర్(చెన్నూర్):** మండల కేంద్రంలోని ఎస్టీపీపీ ప్రాణహిత అతిథిగృహంలో మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో జైపూర్ సబ్ డివిజన్, సిరోంచ పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, సిరోంచ డీఎస్పీ సుహాస్ షిండే, శ్రీరాంపూర్ సీఐ రమేశ్ బాబు, చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, సిరోంచ సీఐ సుదర్శన్ కట్కర్, బామిని సీఐ మధన్ మస్కే, రేగుంట సీఐ కృష్ణ కాటే, వెంకటాపూర్ ఎస్సై అజింక జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## వీవోఏల కృతజ్ఞత సభ



మాట్లాడుతున్న బాల్క సుమన్

**నస్పూర్:** పొదుపు సంఘాల ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో గ్రామ సంఘ సహాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని ఐడీవోసీలో గ్రామ సంఘ సహాయకుల జిల్లా స్థాయి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ పరిధిలో 4,31,402 మహిళా సంఘాలు, 46,21,272 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. చెన్నూర్ నియోజక వర్గంలోని ప్రతీ గ్రామంలో సమ్మక్క–సారలమ్మ మహిళా భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, జెడ్పీటీసీలు, గ్రామ సంఘ సహాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.